
# సత్యవాక్కు

## the word of truth



క్రైస్తవ మాసపత్రిక

MARCH 1997

# సంక్షిప్త వార్తలు

ఫిబ్రువరి 4నుండి 8వరకు జాషువా గూటం దంపతులు ఒరిస్సాలోని కటక్, భువనేశ్వర్ పట్టణములను సందర్శించి ఒరియా భాషలో బేసిక్ బైబిలు కోర్సును త్వరలో ప్రవేశపెట్టుటకు తగుఏర్పాట్లు చేసిరి.

ఫిబ్రువరి 18వ తేదీ మంగళవారం కృష్ణాజిల్లా క్రీస్తు సంఘ సువార్తికుల సదస్సు మైలవరం-వెల్వడంలో భాస్కర్ నగర్‌లోని క్రీస్తుసంఘ ఆవరణలో జరిగెను. కృష్ణాజిల్లాలోని పలు గ్రామములనుండి పట్టణములనుండి కూడి వచ్చిన 120 మంది సోదరులతో ఆలయం నిండి యుండగా "బైబిలు గ్రంథము దేవుని వాక్యమని ఏల నమ్మగలము ?" అను అంశము చర్చించబడెను. ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభమైన సదస్సు సాయంత్రం నాలుగున్నర గంటల వరకు చక్కని వాతావరణంలో, గొప్ప ఆనందోత్సాహములతో కొనసాగెను.

ఉదయకాల సమావేశమునకు సోదరులు సోదరులు జి. మార్కు (నందిగామ) గారును మధ్యాహ్నకాల సమావేశమునకు సోదరులు ఇందుపల్లి ఇశ్రాయేలు (తిరువూరు) గారును అధ్యక్షత వహించి సదస్సును సమర్థవంతముగా నడిపించిరి. పై అంశముపై సోదరులు కె. ఇశ్రాయేలు (కంభంపాడు), సి. హెచ్. కాంతారావు (రామచంద్రాపురం), ఓర్సు ఆదాము (నూజివీడు), యం. సువర్ణరాజు (రెడ్డిగూడెం), వి. బాబూరావ్ (వెంకటాపురం), బి. ఆనందరావు (ఖమ్మం), జి. శ్యామ్ ప్రసాద్ (దేవినేని పాలెం), టి. ప్రసాదరావ్ (మైలవరం), మరియు జాషువా గూటం గార్లు చక్కటి సందేశముల నిచ్చిరి.

బైబిలు మానవకల్పితం కాదు. అది పరిశుద్ధాత్మావేశముచే లిఖించబడిన గ్రంథము. 1600 వందల సంవత్సరాల కాలములో 40 మంది లేఖకులను దేవుడు దాన్ని లిఖించుటలో వినియోగించినను, ఆయా లేఖకులు వివిధ కాలాల్లో వివిధ వృత్తులు కలిగిన వారైనను, వారిని నడిపించిన దైవాత్మ మార్పులేనివాడుగనుక అందు ఏకీభావం వున్నది. అది విజ్ఞానశాస్త్ర ప్రకారముగాను, భౌగోళికంగాను, చారిత్రాత్మకం గాను యధార్థమైనది. అందున్న ప్రవచనముల నెరవేర్పే అది దైవకృతమని ఋజువు చేయుచున్నది, దానికి మనం కలుపకూడదు, దానినుండి తీసివేయకూడదు. అది సర్వకాల సర్వావస్థలమందున్న మానవులందరికి వర్తించునది. ఏలయనగా అది ఏకైక దేవుని వాక్యమై యున్నది. దానిని విని, విశ్వసించి, దానికి లోబడిన వాడు ధన్యుడు. దానిపై తిరుగుబాటు చేయువాడు నాశనమగును గాని అది నిత్యము నిలుచును. ఏలయనగా అది దేవుని వాక్యమని సహోదరులు హెచ్చరించిరి.

# సత్యవాక్యం

## THE WORD OF TRUTH

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

Phone : 0884-63722

**Editor :** **J.C.CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 17 | మార్చి 1997 | సంచిక 8

## సంపాద కీయం

### యేసేప్రభువై యున్నాడు
### (Jesus is Lord )

యేసేప్రభువు. నారక్షకుడు. ఆయన నన్నెంతో ప్రేమించును. నేనెంతో ఆయనను ప్రేమింతును. ఆయన లేచియున్నాడు. మరల వచ్చుచున్నాడు. ప్రభువా త్వరగా రమ్ము అను ఈమాటలు అతిమాధుర్యమైనవి. అయితే వాటి భావం యేమిటి ? యేసేప్రభువని ఒప్పుకొనుటలో యున్న ప్రాముఖ్యత ఏమిటి ?

మొదటిగా క్యూరియోస్ (Kurious ) అనే గ్రీకు పదమునకు ప్రభువని అర్థము. మొదటి శతాబ్దములో ఘనతను సూచించుచు సంబోధించుటకు ఇది వినియోగింప బడెనని మనం గ్రహించాలి. శారా అబ్రాహామును యజమానుడని పిలచినట్లు పేతురు చెప్పినప్పుడు (1పేతు 3:6) భర్తలు యజమానులని భార్యలు గృహోపకరణములని అతని ఉద్దేశము కాదు. గాని శారా తనభర్తను గౌరవించినట్లు తెలియజేయుటకు అతడట్లు చెప్పాడు. యోహాను 12:21లో కొందరు గ్రీసుదేశస్థులు యేసును చూడగోరి వచ్చినపుడు ఫిలిప్పును (అయ్యా అని) సంబోధించారు.

మరియ యేసును తోటమాలి అనుకొని నప్పుడు ఇదే మాటను ఆమె యోహాను 20:15లో ఉపయోగిస్తాది. సువార్తలో యేసును సంబోధిస్తూ తరుచు ఈ మాట వినియోగింపబడింది.

'క్యూరియోస్' అను పదము తరుచు ఒక యజమానిని ( ) సూచించడానికి వినియోగింపబడేది. మత్తయి 20వ అధ్యాయములో ద్రాక్షతోట ఉపమానములో వాడబడిన పదము యిదే . యజమాని దేవుడు . దాసులను కలిగియున్న యజమానుల విషయములో కూడ ఈ పదము వాడబడినది (ఎఫెసీ 6:9).

'క్యూరియోస్' అను పదము దేవుని యొక్క బిరుదుగా కూడ వాడబడినది. ఇశ్రాయేలు చరిత్రలో ఒక ఆసక్తికరమైన సంగతి జరిగింది. దేవుని నామమును గూర్చి గొప్ప భయము భక్తి ఉద్భవించినది. పది యాజ్ఞలలో మూడవ ఆజ్ఞను పురష్కరించుకొని ఇట్టి అత్యంత భావములుద్భవించి యుండ వచ్చును. " నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింప కూడదు" (నిర్గమ 20:7). గనుక దేవుని నామము ఏమిటి ? దేవుడు అనుమాట ఒక నామము కాదు. అదొక వర్ణాత్మకము మాత్రమే. నీ పేరేమిటి అని నేనడిగిన యెడల నీవు నేనొక పురుషుడను, లేక స్త్రీని అని జవాబిత్తువు గదా. మనము ఆరాధించే మూర్తి దేవుడు. మానవుని నుండి ప్రత్యేకముగా యున్నవాడాయన. నిర్గమ 3లో నీపేరేమిటని మోషే దేవుని నడుగుతాడు. హెబ్రీ భాషలో రికార్డయిన పేరు యావే లేక యెహోవా (Yahweah or Jehoveh ) అని యున్నది. ఈ ఫేరు యొక్క అర్థము నేను ఉన్నవాడనై యున్నాను. నేను ఉండువాడనై యున్నాను అని యున్నది. మూడవ ఆజ్ఞను బట్టి హెబ్రీయుడు దేవుని నామమును ఉచ్చరింపడు. ఇశ్రాయేలీయుడెవడైనను ఈ నామమును చూడగానే యెహోవా అను పలుకుటకు బదులు "ప్రభువు" అని ఉచ్చరించును. అట్లు ప్రభువనే పదము నిజదేవుని సూచించడానికి వర్తింపజేయుటకు వాడబడేది.

## ప్రభువే దేవుడు

అందువలన "యేసుప్రభువై యున్నాడని" ఒప్పుకొనుటలో యేసే దేవుడై యున్నాడని ఒప్పుకొనుటయని మనం గ్రహించాలి. ఆదిమ సంఘములో ఇదియిట్లు

వాడబడినట్లు మనము చూడగలము. రోమా 14:8లో పౌలు యిట్లు అన్నాడు: మనము బ్రతికినను ప్రభువు కోసమే బ్రతుకుచున్నాము చనిపోయినను ప్రభువు కోసం చనిపోవుచున్నాము. కాబట్టి మనము బ్రతికినను చనిపోయినను ప్రభువు వారమై యున్నాము. హెబ్రీ 1:8లో దేవుడు యేసుతో ఇట్లనుచున్నాడు: దేవా నీ సింహాసనము నిరంతరము నిలుచునది. నీవు నీతిని ప్రేమించితివి. దుర్నీతిని ద్వేషించితివి. అందుచేత దేవుడు నీ దేవుడు నీ తోడివారికంటె నిన్ను హెచ్చించునట్లుగా ఆనందతైలముతో అభిషేకించెను. ప్రభువా నీవు ఆదియందు భూమికి పునాది వేసితివి. ఆకాశములు కూడ నీచేతిపనులే (9,10,11 వచనములు). యేసు పునరుత్థానుడైన తరువాత తోమా ఆయనను చూచి నా ప్రభువా, నాదేవా అనుటలోని భావము బహుశ యిదే అయ్యుండవచ్చును (యోహాను 20:28). రోమా 10:9లో పౌలు యేసుప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయములో విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు అను మాటలో పౌలు యొక్క భావము కూడయిదే. రోమా 13:14లో పౌలు రోమీయులకు ప్రభువైన యేసుక్రీస్తును ధరించుకొనుడి యని చెప్పాడు. గలతీ 3:26-27లో అతడిట్లన్నాడు. యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవునికుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు.

యేసును ప్రభువని గుర్తించుటయే ఆయన శరీరధారియైన దేవుడని గుర్తించుట. దేవుడు మానవతారియై మనపాపముల నిమిత్తము సిలువలో బలి యగుటను తిలకించుటయే. ఆయన ప్రభువని మనము నమ్మాలి. ఆయన సార్వభౌమత్వము లోనికి బాప్తిస్మము పొందాలి.

## దేవుని సొత్తు

ఒకడు క్రైస్తవుడగునపుడు అతడు లేక ఆమె తనకు కాదుగాని దేవునికి చెందును. 1కొరింథీ 6:19-20లో ఇట్లున్నది: మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకాదు. విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని

మహిమ పరుచుడి. గనుక ప్రభువని గుర్తించుటలో యజమాని యని గుర్తించుట యున్నది. అందువలననే పౌలు క్రీస్తుయొక్క దాసుడని తాను చెప్పుకోగలిగాడు(రోమా 1:1). మనము దేవుని దాసులుగా జీవించాలని పేతురు చెప్పాడు (1పేతురు 2:16).

## దేవుని స్నేహితులం

అయినను ప్రభువుతో మనమొక ప్రత్యేక సంబంధమును కలిగియున్నాము. యోహాను 15:12-15లో యేసు ఇట్లన్నాడు: నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము మీరొకని నొకడు ప్రేమించవలెననుటయే నా ఆజ్ఞ. తన స్నేహితులకొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువ ప్రేమగలవాడు ఎవడును లేడు. నేను మీకాజ్ఞాపించువాటిని చేసిన యెడల మీరు నాస్నేహితులై యుందురు. దాసుడు తన యజమానుడు చేయుదానిని ఎరుగడు గనుక ఇక మిమ్మును దాసులని పిలువక స్నేహితులని పిలుచుచున్నాను. ఎందుకనగా నేను నా తండ్రివలన వినిన సంగతులన్నిటిని మీకు తెలియజేసితిని. మరల 17వచనములో మీరు ఒకని నొకడు ప్రేమింపవలెనని మీకు ఆజ్ఞాపించుచున్నాను. యేసుప్రభువని, సృష్టికర్తయని, సమస్తాధికారము ఆయన కలిగి యున్నాడని మనము గుర్తించ వలెను (మత్తయి28:18). మనము జ్ఞానహీనులైన బానిసలముగా గాక స్నేహితులముగా స్వీకరింపబడితిమి. ఎంత ఆశ్చర్యకరమైన భావమో! యేసేప్రభువు. అయినను ఆయన నా వ్యక్తిగత స్నేహితుడు. నేనేమి చేయాలో చెప్పుట మాత్రమే గాక ఆయన ఎందుకు చేయాలో తెలియజేస్తాడు.

ఆయన స్నేహితునిగా యుండాలంటే ఆయన మనల్ని ప్రేమించినట్లు మనము ఒండొరులను ప్రేమించాలి.

## క్రీస్తుతోడి వారసులము

గలతీ 4:1-7లో పౌలు ఇట్లనుచున్నాడు: వారసుడు అన్నిటికి కర్తయైయున్నను బాలుడై యున్నంత కాలము అతనికని దాసునికిని బేధములేదు. తండ్రిచేత నిర్ణయింపబడిన దినము వచ్చువరకు అతడు సంరక్షకుల యొక్కయు గృహ నిర్వాహకుల యొక్కయు అధీనములో ఉండును. మనము బాలురమై యున్నప్పుడు లోకభారములకు బానిసలము. అయితే దాసత్వము నుండి కుమారత్వము

ననుగ్రహించుటకు దేవుడు యేసును పంపాడు. విశ్వాసి బాప్తిస్మము పొందినప్పుడు క్రీస్తును ధరించుకొంటాడు (గలతీ 3:27). మరియు మన హృదయములలోనికి దేవుడు పరిశుద్ధాత్మను పంపుతాడు. అప్పుడు పరిశుద్ధాత్మవలన "అబ్బా" "తండ్రీ" యని మొర్రపెట్టగలము. మనము దేవుని కుమారులము. కుమార్తెలము. ఆయన ఆశీర్వాదములకు వారసులము.

గనుక యేసేప్రభువని మనము పాడినను మాట్లాడినను ఆయన దైవాత్వాన్ని స్నేహాన్ని ఒప్పుకొనుచున్నాము. మన స్థానములో యేసుపొందిన మరణమును బట్టి మనకు కలిగిన ప్రత్యేక సంబంధము వలన మనము దేవుని బిడ్డలము. ఈ సంబంధాన్ని ప్రకటిస్తాము.

అయినను మనము సరియైన క్రమాన్ని పాటించుట అవుసరము. యేసుమన మిత్రుడు కాక ముందు ఆయన యజమాని యని, దేవుడని ఒప్పుకోవాలి.

## ద్రాక్షావల్లి మరియు తీగెలు

## (The Vine and the Branches )

(జనవరి సంచిక తరువాయి)

### ఫలించాలంటే క్రీస్తులో యుండాలి.

ఒకడు ఫలములు ఫలించాలంటే క్రీస్తుతో ప్రాముఖ్యమైన సంబంధం కలిగి యుండాలి. తీగెయొక్క ఫలించుశక్తి ద్రాక్షావల్లితో దానికి గల సజీవ సంబంధము పై ఆధారపడి యుంటాది. అందువలన, "నాలో ఫలింపని ప్రతీతీగెను ఆయన తీసి పారవేయును; ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికి రాని తీగెలను తీసివేయును" అని క్రీస్తు చెప్పాడు. మరల, "నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు" అని ఆయన చెప్పాడు. మనము ధ్యానించుచున్న వాక్య భాగములో క్రీస్తు "నాలో" అను మాటను 6 సార్లు వినియోగించాడు. మానవుడు క్రీస్తులో నున్నప్పుడే దేవుని కొరకు ఫలములు ఫలిస్తారు. ఒకడు నైతికంగా ఎంతటి పవిత్రుడైననూ క్రీస్తునుండి వేరై రక్షణ పొందలేడు.

క్రీస్తులో ఏకము కాకమందు కొర్నేలీ నైతికంగా మంచివాడే గానీ అతడు రక్షింప బడలేదు (అపొ.కా. 10:1-3; 11:14). రక్షణ క్రీస్తులో ఉన్నది. గనుక క్రీస్తుకు వెలుపల ఆత్మీయ జీవము లేదు (2తిమోతి 2:10). "మరి ఎవనివలనను రక్షణ కలుగదు" అని పేతురు చెప్పాడు (అపొ.4:12). కుమారునిలో జీవమున్నది (1యోహాను 5:11-12). "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నాద్వారానే తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడు" అని క్రీస్తు చెప్పాడు (యోహాను 14:6).

క్రైస్తవులు కానివారు క్రీస్తుకు వెలుపల యుండి క్షేమముగానే యున్నామను కొనుచూ మోసపోవుచున్నారు. ద్రాక్షావల్లి నుండి వేరై తీగెఫలములను ఫలించలేదు. క్రీస్తుతో సత్సంబంధము కలిగినవారే ఫలములు ఫలించగలరు. అట్లయితే ఒకడు క్రీస్తులోనికెట్లు ప్రవేశిస్తాడు? పౌలు దానికి జవాబిచ్చాడు: "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ? కాబట్టి తండ్రిమహిమ వలన క్రీస్తు మృతులలోనుండి ఏలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచు కొనునట్లు మనము బాప్తిస్మము వలన మనణములో పాలుపొందుటకై ఆయనతో కూడా పాతిపెట్టబడితిమి (రోమా 6:4). మరల, "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:27).

పై వచనమును బట్టి ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందేవరకూ యోగ్యమైన ఫలములు ఫలించలేడని గ్రాహ్యమగుచున్నది. ఒకడు క్రీస్తులోనైనా వుంటాడు. లేదా ఆయనకు వెలుపలనైనా వుంటాడు. మానవులను క్రీస్తులోనికి తెచ్చుటకు బాప్తిస్మము దేవుడు నిర్ణయించిన మార్గము.

క్రీస్తులో యండుట అనగా ఆయన సంఘములో యండుట అని బైబిలు బోధించుచున్నది. క్రీస్తు సంఘమను శరీరమునకు శిరస్సైయున్నాడని పౌలు చెప్పాడు (కొలస్స 1:18). సంఘము ఆయన శరీరము (ఎఫెసీ 1:23). గనుక క్రీస్తులో నుండుట యనగా ఆయన శరీరమయిన సంఘములో నుండుట. ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు అతడు గత పాపముల నుండి రక్షింపబడి ప్రభువుచే సంఘముతో చేర్చబడినవాడు (అపొ.కా. 2:47). ఒకడు క్రీస్తులోను,

ఆయన సంఘములోను యున్నాడనుటలో అతడొక డినామినేషన్‌లో యున్నాడనుట కాదు. సంఘము రక్షింపబడిన దేవుని కుటుంబము.

క్రీస్తులో యుండుట అనగా ఆయన సంఘములో యుండుటతో సమానము గనుకను, ఫలించాలంటే ఒకడు క్రీస్తుతో యుండాలి గనుకను, క్రీస్తు సంఘములో లేనివాడు దేవుని మహిమ కొరకు ఫలములు ఫలించలేడు (ఎఫెసీ 3:21).

## ఫలిస్తూ యుండాలంటే క్రీస్తులో నిలిచి యుండాలి

జీవము కొరకు, ఫలించుట కొరకు శిష్యుడు క్రీస్తులో నిలిచి యుండాలి. నాయందు మీరును, మీరు నాయందును నిలిచి యుండాలని క్రీస్తు చెప్పాడు. క్రీస్తులోనికి ప్రవేశించుట మాత్రము కాదుగాని ఆయనలో నిలిచియుండాలని కూడా. "ఎవడు నాయందు నిలిచి యుండునో, నేను ఎవనియందు నిలచియుందునో వాడు బహుగా ఫలించును". ఆయనలో నిలిచి యుండకపోతే, ఫలహీనత పారవేయబడుట సంభవించును. "నాలో ఫలింపని ప్రతితీగెను ఆయన తీసి పారవేయును " (యోహాను 15:2).

తీగెయొక్క ప్రయోజనం ఫలించుట: ఫలింపని తీగె నరికి వేయబడును. తీగెకును ద్రాక్షావల్లికిని యున్న సంబంధమే క్రీస్తుకును, క్రైస్తవునికి ఉన్నందున, క్రీస్తునందున్నవాడు ఫలించని యెడల అతడు పారవేయబడును. "ఎవడైననూ నాయందు నిలచియుండని యెడల వాడు తీగెవలె బయట పారవేయబడి యెండి పోవును, మనుష్యులు అట్టివాటిని ప్రోగుచేసి అగ్నిలో పారవేతురు. అవి కాలి పోవును". గనుక ద్రాక్షావల్లిలో యున్న తీగె పారవేయబడును. ఫలింపని తీగె బయట పారవేయబడి యెండిపోగలదు.

ఫలింపని తీగెలు ఎట్లు పారవేయబడి, ఎండిపోయి కాల్చబడునో అట్లే క్రీస్తునుండి వేరుచేయబడిన వారి గతి యుండును. కాలాంతమందు క్రీస్తు "తన దూతలను పంపును; వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైన వాటిని దుర్నీతి పరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును, పండ్లు కొరుకుటయు ఉండును (మత్తయి 13:41,42).

మార్పునొంది, దేవుని బిడ్డయైన వాడు నిత్యము నాశనము కావచ్చునని దీనియర్థము. క్రైస్తవుడైనవాడు పతనము కాలేడని వాదించేవారు, అతడెన్నడు ద్రాక్షావల్లిలోలేడని అంగీకరించాలి. క్రైస్తవులు క్రీస్తులో నిలిచి యుండాలని బోధించు నిమిత్తము పౌలు ఇశ్రాయేలీయుల నుండి మంచి పాఠాన్ని ఉపదేశించాడు. "దేవుడు స్వాభావికమైన కొమ్మలను విడిచిపెట్టని యెడల నిన్నును విడిచిపెట్టడు. కాబట్టి దేవుని అనుగ్రహమును, కాఠిన్యమును అనగా పడిపోయిన వారిమీద కాఠిన్యమును నీవు అనుగ్రహపాత్రుడవై నిలిచి యున్న యెడల నీమీదనున్న దేవుని అనుగ్రహము చూడుము. అట్లు నిలువని యెడల నీవును నరికి వేయ బడుదువు" (రోమా 11:21,22). (సశేషము)

పెర్రి బి. కోతమ్.

## చిన్నపిల్లలు బాప్తిస్మము పొందవలెనా ?

## ( Should Infants be Baptised ? )

చిన్నపిల్లలు ఏ పాపములేనివారు. మొదటి మానవుడైన ఆదాము చేసిన పాపమునకు చిన్నపిల్లలు వారసులని కొందరు బోధించుచున్నారు. జన్మించిన ప్రతి శిశువు పాపములో నశించిన వాడని వారు బోధించుచున్నారు. బైబిలు అట్టి బోధన బోధించుటలేదు.

ఆదాము హవ్వలు చేసిన పాపమువలన కొన్ని ఫలితములు కలిగెను. ఆదాము హవ్వలు నిర్దోషులుగా మొదట నివసించిరి. మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినుట ద్వారా దేవునికి అవిధేయులైరి. వారు ఆఫలముతినినపుడు దేవుడు వెంటనే వారికి మంచి చెడ్డల తెలివి నిచ్చెను. ఆ తెలివి ద్వారా చెడును విసర్జించి మంచిని జరిగించవలసియున్నది. ప్రతి స్త్రీ పురుషుని యందు వారు ఎదుగుచున్న కొలది మంచి చెడ్డలను వివేచించే ప్రాథమిక జ్ఞానము కలుగుతుంది.

ఆదాము హవ్వను దేవుడు వారి పాపము నిమిత్తమై అనేక విధములుగా శిక్షించెను. స్త్రీకి ప్రసవవేదన కలుగజేసెను. భర్తకులోబడి యుండునట్లు ఆమెను ఆజ్ఞాపించెను. పంటను పండించుటకు కష్టపడునట్లు ఆయన ఆదాము పై భారమును వేసెను. మానవుడు భౌతికముగా చనిపోవునట్లు ఆయన నియమించెను.

ఏదేను వనము నుండి ఆదామును హవ్వను పారద్రోలెను (ఆది 3). ఈ ఫలితాలతో పాటు ఆదాము హవ్వల పాపము లోకములోనికి ప్రవేశించెను (రోమా 5:12). ఇపుడు పాపము సమృద్ధిగానున్న లోకములో ప్రతి వ్యక్తి జన్మించుచున్నాడు. మనము పరిపక్వతకు దిన దినము ఎదిగి, పాపము చేయుట ప్రారంభించుచున్నాము. "అందరును పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవు చున్నారు "(రోమా 3:23). ఆదాము పాపము యొక్క ప్రభావము మనమీద ఉన్నది. కాని ఆదాము చేసిన పాపము అతనికే పరిమితము. చిన్నపిల్లలు ఆదాము యొక్క పాపమునకు వారసులు కారు. బైబిలు ఈ విషయాన్ని విశదీకరించుచున్నది.

1. పాపము ఒక కార్యము (1యోహాను 3:4). ఒకడు ఆలోచన ద్వారా, మాటద్వారా, క్రియద్వారా, లేక మేలైనది జరిగించక పోవుట ద్వారా పాపము చేయును. జుట్టు రంగు వారసత్వముగా సంక్రమించునట్లు పాపము వారసత్వముగా సంక్రమించదు.

2. భౌతిక శరీరము యొక్క కోరికలు మనలను పాపమునకు నడింపించును (యాకో 1:13-15). కాని మనము జన్మించినపుడు పాపము మన శరీరములో లేదు .క్రీస్తు మనవలె రక్త మాంసములు కలిగి యుండెను (హెబ్రీ 2:14). అయి నప్పటికిని ఆయన పాపరహితుడు (హెబ్రీ 4:15 పేతురు 2:22).

3. చిన్నపిల్లలు పాపములేని వారని యేసు సెలవిచ్చెను. కొందరు చిన్నపిల్లలు యేసునొద్దకు ఆయన చేతులుంచవలెనని తీసుకొని వచ్చిరి.ఆయన శిష్యులు వారిని ఆటంకపరచ వలెనని ప్రయత్నించగా యేసుతన శిష్యులను గద్దించి "చిన్నపిల్లలను ఆటంకపరచక వారిని నా యొద్దకు రానియ్యుడి. పరలోకరాజ్యం ఈలాంటివారిదే" అని చెప్పెను (మార్కు 10:14).

4. చిన్నపిల్లలు వారిపితరుల పాపములకు బాధ్యులు కారు. పాపము చేయువాడే మరణమునొందును. తండ్రియొక్క దోషశిక్షను కుమారుడు మోయుటలేదని కుమారుని దోషశిక్షను తండ్రిమోయడు (యెహె 18:20).

5. ఆఖరిదినము ప్రజలందరును క్రీస్తుయెదుట నిలువబడినవారై తీర్పు తీర్చ బడుదురు. ప్రతివాడు తాను జరిగించిన క్రియల చొప్పున తీర్పు తీర్చబడుదురుగాని ఆదాము జరిగించిన క్రియలు చొప్పున కాదు. ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన

వాటి ఫలమును ప్రతివాడు పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును (2కొరింథీ 5:10). రోమా 14:10-12, ప్రకటన 22:12 చూడండి.


6. చిన్నపిల్లలు సువార్తకు విధేయులగుట అసాధ్యము. వారు సువార్తను అర్ధము చేసికొనలేరు. వారు సువార్తను విశ్వసించలేరు. మారుమనస్సు పొందలేరు. (పాపములనుండి తిరుగుటకు నిశ్చయము) వారు కొన్ని నిర్ణయములు తీసికొనలేరు. మార్పునొందుటకు వారు పాపములు చేయలేదు. యేసుక్రీస్తునందలి విశ్వాసమును వారు ఒప్పుకొనలేరు. హృదయపూర్వకముగా (రోమా 6:17) వారు ఈ ఆజ్ఞకు లోబడలేరు గనుక వారు బాప్తిస్మమును క్రమము చొప్పున పొందలేరు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినపుడు పాపులు విశ్వాసము ద్వారా రక్షింపబడుదురు (గలతీ 3:26,27; అపొ.కా. 2:38; కొలస్స 2:12). చిన్నపిల్లలు బాప్తిస్మము పొందినట్లు ఎట్టి ఆధారము క్రొత్తనిబంధన కలిగియుండలేదు. వారు పాపమునుండి రక్షింపబడ వలసిన అవసరము లేదు. ఎందుకనగా వారు అమాయకులు పాపరహితులు

- రోయస్ ఫ్రెడరిక్.

## కాలము యొక్క పరమార్ధము - 3
## (The Essence of Time -3 )

పాతనిబంధన గ్రంథమును ఇప్పటికి రెండుమార్లు పఠించాము. కాలములను వాటి వివరణను మొదట గమనించాము. మరల ధర్మశాస్త్రము, చరిత్ర గ్రంథములను బట్టి మరియొకసారి గమనించాము. అందున్న 12కాలములలో మనము బాగుగా ఎరిగిన వ్యక్తులనుంచుటయే మూడవదశ యగును. దిగువ పటము యొక్క వివరణ :

| | |
|---|---|
| 1 గంట | - కయీను, హేబేలు, షేతులు ఆదాము హవ్వల యొక్క ముగ్గురు కుమారులు, వీరిపేర్లు గ్రంథములో కనబడ్తాయి. షేతు యొక్క వంశావళి నుండియే మెస్సీయ వచ్చెను. |
| 2 గంటలు | - షేము, హాము, యాపెతులు నోవహు యొక్క |




ముగ్గురు కుమారులు. షేము వంశావళినుండి మెస్సీయ వచ్చెను.

3 గంటలు - అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, యూదాలు మెస్సీయ వంశావళిలో నుండిరి. ఈ కాలములో యోసేపు ఒకగొప్ప వ్యక్తి గనుక అతనిపేరు ఇక్కడ చేర్చబడినది.

4 గంటలు - ఐగుప్తు బానిసత్వమునుండి దేవుని ప్రజలను విడిపించుటకు మోషే పిలువబడెను. అహరోను మోషే యొక్క అన్న మరియు యాజకత్వములో అహరోను ప్రధాన యాజకుడు. యాజకత్వ విధుల నిమిత్తము లేవీగోత్రము ప్రతిష్ఠింపబడెను. ఫరో ఐగుప్తురాజు.

5 గంటలు - కానాను దేశమును వేగు చూచుటకు పంప బడిన 12 గురులో యెహోషువ, కాలేబులిద్దరు ఆ దేశమును జయించగలమని చెప్పిరి.

| | | |
|---|---|---|
| 6 గంటలు | - | మోషే మరణించిన తరువాత యెహోషువ వాగ్దాన దేశమునకు దేవుని ప్రజలను నడిపించెను. విజయము సాధించెను. |
| 7 గంటలు | - | గిద్యోను. బారాకు, సమ్సోను, యెఫ్తా యను న్యాయాధిపతులు హెబ్రీ పత్రిక 11వ అధ్యాములో విశ్వాసవీరుల పట్టికలో చేర్చబడినవారు. |
| 7:30 గంటలు | - | రూతు గ్రంధములోని ప్రముఖ వ్యక్తులు వీరు: బోయజు, రూతులు దావీదు యొక్క వంశకర్తలు. ఓబేదు వారి కుమారుడు. |
| 8 గంటలు | - | సమూయేలు ఆఖరి న్యాయాధిపతి. సంయుక్త రాజ్యము యొక్క మొదటి యిద్దరి రాజులను అతడు అభిషేకించెను. సౌలు. దావీదు, సొలొమోనులు ఒక్కొక్కరు నలుబది సంవత్సరముల మట్టుకు ఏలిరి. |
| 9 గంటలు | - | సొలొమోను కుమారులైన రెహబాము యూదా రాజ్యము యొక్క రాజు. యరొబాము ఇశ్రాయేలు రాజ్యమునకు రాజు. ఆ కాలమందు ప్రముఖ ప్రవక్తలైన ఏలియా, ఎలీషా అనువారు ప్రజలమధ్య పని చేసిరి |
| 10 గంటలు | - | హిజ్కియా, యోషీయ,యెహోయాకీము, సిద్కియా అనువారు యూదా సామ్రాజ్యము బబులోను బాని సత్వమునకు కొనిపోక ముందున్న యూదా రాజులు. |
| 11 గంటలు | - | ఎస్తేరు గ్రంధమందలి ప్రముఖ వ్యక్తి ఎస్తేరు. మొర్దెకై ఆమెయొక్క పెంపుడు తండ్రి. హామాను అనునతడు ఇశ్రాయేలీయులను నాశనము చేయ వలెనని సంకల్పించిన వారి ఉమ్మడి శత్రువు. |

| | | |
|---|---|---|
| 12 గంటలు | - | పారసీక దేశపు రాజైన కోరేషు యూదులు తమ స్వదేశమునకు వెళ్లుటకు సెలవిచ్చెను. జెరుబ్బాబెలు యెరూషలేముకు మొదట తిరిగి వచ్చిన వారికి నాయకత్వము వహించెను. |

ఆయా కాలములలో నీవుంచదగిన అనేకమంది వ్యక్తులు కలరు. దేవుని సంకల్పములో ప్రముఖముగా కనబడు వ్యక్తులను మనం ఈ పటము నందుంచాము. మరియు క్రీస్తుయొక్క వంశావళిలో గల వ్యక్తులు కూడ ఇందున్నారు. క్రీస్తును గూర్చియు, ఆయన రాజ్యమైన సంఘమును గూర్చియు ఉన్న పాతనిబంధన లేఖనములను అన్నిటిని తెలిసికొనుట చాల ముఖ్యము. ఏలయనగా క్రొత్తనిబంధనను సరిగ అర్ధము చేసికొన గలుగుటకే పాతనిబంధనను మనము దీర్ఘముగ పఠించు చున్నామను సంగతి మరచిపోరాదు. ఎమ్మాయు పోవు మార్గములో పయనించుచున్న యిద్దరు శిష్యులకు యేసు పాతనిబంధనలో తన్ను గూర్చి వ్రాయబడినవన్నియు వివరించి యుంటే ఎంత బాగుండునో కదా ?

- ఫ్రేంకీ లూపర్.

## క్రీస్తు సంఘము
## ( The Church of Christ )

నూతన నిబంధనలో వివరింపబడిన సంఘము దైవికమైనది. ఎట్లన దేవుడే దాని రూపశిల్పి. క్రీస్తే దానికి వెల (స్వరక్తము) చెల్లించి నిర్మించాడు. మత్తయి 16:18లో "ఈ బండ (యేసుక్రీస్తు దేవుని కుమారుడని పేతురు ఒప్పుకొన్న సత్యము) మీద నా సంఘమును కట్టుదును" అని క్రీస్తు సెలవిచ్చారు. కనుక సంఘము క్రీస్తుయొక్క ఆత్మీయశరీరమై యున్నది. "ఆ సంఘము ఆయన (క్రీస్తు) శరీరము (ఎఫెసీ 1:23). "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు" (కొలస్స 1:18). అంతేకాదు సంఘము అనగా క్రీస్తు ఆ దేశములను నమ్మి బాప్తిస్మము పొందినవారి కూడికయై యున్నది. (మార్కు 16:15,16; అ.కా. 2:36-47; గలతీ 3:26,27).

నూతన నిబంధన సంఘము (క్రీస్తు సంఘము) మతశాఖ కాదు. ఇది మానవులు అధికార దాహంతో మతాన్ని చీలికలు చేసి మతశాఖలకు రూపకల్పన చేయకముందే యున్నది. అలాగని మతశాఖలు క్రీస్తుసంఘము నుండి వేరైన శాఖలు, ఉపశాఖలు కాదు. అబద్ధ బోధకుల వాక్చాతుర్యం మనుష్యులు కల్పించిన పద్ధతులే మతశాఖలు. అది సత్యముకాదని, దైవవాక్యానుసారము కాదని క్రీస్తేనుడివారు. "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15:9).

క్రీస్తుసంఘము మానవ నిర్మితమైన ఒక కట్టడము కాదు. అది పిలువబడిన వారి సముదాయము.

1. పాపముల విషయమై మారుమనస్సు పొందినవారి సముదాయమే క్రీస్తుసంఘము (లూకా 5:32).
2. దేవుని వాక్యమును విని అంగీకరించి బాప్తిస్మము పొంది, ప్రభువుద్వారా సంఘముతో చేర్చబడిన వారి సమూహమే క్రీస్తుసంఘము (అపో.కా 2:41,47).
3. ప్రభువైన యేసుక్రీస్తు నామమునను, మనదేవుని ఆత్మయందును, కడుగబడి పరిశుద్ధ పర్చబడిన వారి సముదాయమే క్రీస్తుసంఘము (1కొరింథీ 6:11).
4. యూదామతము నుండి సత్యమును గ్రహించి క్రైస్తవ్యములోనికి అడుగిడిన భక్తిగల యూదుల సమూహమే క్రీస్తుసంఘము (అపో.కా. 2:5).
5. పాపపు గాఢాంధకారము నుండి ఆశ్చర్యకరమైన క్రీస్తు వెలుగులోనికి పిలువబడిన వారి సముదాయమే క్రీస్తుసంఘము (1పేతురు 2:9).
6. విగ్రహారాధన విడిచి, జీవముగల వాడును సత్యవంతుడగు దేవునికి దాసులగుటకు అంగీకరించినవారి కూడికయే క్రీస్తుసంఘము (1థెస్స 1:9).
7. మతశాఖల మానవకల్పిత బోధలనుండి సర్వసత్యము లోనికి నడిచిన వారి సముదాయమే క్రీస్తుసంఘము "......... మీరు దాని పాపములో పాలివారు కాకుండునట్లును, దాని తెగుళ్ళలో ఏదియు మీకు ప్రాప్తించకుండునట్లును, దానిని విడిచిరండి" (ప్రకటన 18:4).

నూతన నిబంధన (క్రీస్తు) సంఘము దేవుని కుమారుడు దైవికముగా

నిర్మించబడినది. క్రీస్తే దానికి అధిపతి - ఆయనే దానికి న్యాయమును విధించువాడు - రక్షకుడు - విమోచకుడు.

యేసుక్రీస్తు తన కృపను బట్టి మనలను రక్షించి పరిశుద్ధమైన పిలుపుతో మనలను పిలిచెను. సంఘము క్రీస్తు సొత్తు. సంఘములో నుండుట వలన క్రీస్తు నందున్న సమస్త ఆశీర్వాదములకు వారసుల మగుదుము. అంతేగానీ, ప్రియ చదువరీ ! మానవకల్పిత బోధలు నమ్మి మతశాఖలలో చేరి రక్షణ కోల్పోయెద వేల ?

— ఆర్. ఛెఖెసాంగ్, నాగాలాండ్

## దైవ సంకల్పము

దైవ సంకల్పము అనగా దేవుని యొక్క "ఉద్దేశ్యము" అని అర్థము. మానవుడు దేవుని ఉద్దేశ్యము ఏమిటో తెలిసికోలేక పోవుచున్నాడు. ఉదాహరణకు మనము కొన్ని ప్రాంతాల్ని పరిశీలించినపుడు అక్కడ మనకు ఇటుకలు, ఇసుక, చిన్నసైజు నల్లని రాళ్ళు కనిపిస్తాయి. అక్కడ వాటిని ఏర్పాటు చేసినవాని ఉద్దేశ్యము "నిర్మాణము" అని మనకు అర్థమగుచున్నది. ఈవిధముగా ప్రతి పని వెనుక ఏదో ఒక సంకల్పము ఉన్నదని మనకు తెలుస్తోంది.

ఆలాగుననే సృష్టికర్తయై దేవుడు భూమిని, వృక్షములను, జంతువులను, పక్షులను, సూర్యచంద్ర, నక్షత్రాదులను సృష్టించుటకు గల ఆయన సంకల్పము ఏమిటో తెలసికొందాము !

1. మానవుని ఉపయోగార్థం సర్వసృష్టిని సృష్టించుట ఆయన సంకల్పం (ఆది :29,30).
2. మనం అభివృద్ధి పొందవలెనని ఆయన సంకల్పం (ఆది 1:28).
3. ఆశీర్వాదం కలుగచేయుట ఆయన సంకల్పం (ఎఫెసీ 1:30).
4. తన మహిమకు కీర్తి కలుగ చేయవలెనని ఆయన సంకల్పం (ఎఫెసీ 1:11,12).
5. మనము ఆయనను మహిమ పరచాలని ఆయన సంకల్పం (యెష 43:7).
6. కాలం పరిపూర్ణమైనప్పుడు తనకుమారుని ఈలోకానికి పంపుట ఆయన సంకల్పం (గలతీ 4:4).

7. మనము ప్రథమ ఫలముగా ఉండాలని ఆయన సంకల్పం (యాకోబు 1:8).
8. మరణమును జయించుట ఆయన సంకల్పం (అపో.కా. 2:24).
9. మరణమును నిరర్ధకము చేయుట ఆయన సంకల్పం (2తిమోతి 2:10).
10. పాపులను రక్షించుట ఆయన సంకల్పం (మత్తయి 1:21).
11. బాప్తిస్మము పొందినవారిని రక్షించుట ఆయన సంకల్పం (మార్కు 16:16).
12. యేసు దేవుని కుమారుడని నమ్మక, బాప్తిస్మము పొందక ఆయనను మహిమ పరచక యున్నవారిని శిక్షించుట ఆయన సంకల్పం (మార్కు 16:16).

- పి. ఎస్. నారాయణ, కాకినాడ.

## "యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఏల నమ్మవలెను?"

**(Why we must Believe Jesus Christ as the Son of God ?)**

(గత సంచిక తరువాయి)

5. యేసుక్రీస్తు దేవుని కుమారుడు:- కన్యక గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టెను. యేసుక్రీస్తుకు తల్లి మాత్రం కలదు గాని, భూసంబంధమైన తండ్రి లేడు. అందువలన దేవుడే ఆయనకు తండ్రి. యేసు క్రీస్తు దేవుని కుమారుడు. యేసుక్రీస్తు దేవుని కుమారుడని నిరూపించుటకు బైబిలు ఆధారములు కోకొల్లలు, అవి అన్నియు యిప్పుడు వివరించుట కష్టసాధ్యము. కొన్ని లేఖనాంశములను మాత్రం పరిశీలిద్దాము.

### మానవుల సాక్ష్యము

a. నతనియేలు:- "నన్ను నీవు ఏలాగు ఎరుగుదువని నతనియేలు ఆయనను అడుగగా యేసు, ఫిలిప్పు నిన్ను పిలువక మునుపే నీవు అంజూరపు చెట్టుక్రింద వున్నప్పుడే నిన్ను చూచితినని అతనితో చెప్పెను. నతనియేలు బోధకుడా నీవు దేవుని కుమారుడవు ఇశ్రాయేలు రాజువని ఆయనకుత్తర మిచ్చెను" (యోహాను 1:48,49).

b. మార్త:- యేసుక్రీస్తు మార్తతో "బ్రతికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును యెన్నటికిని చనిపోడు. ఈ మాట నమ్ముచున్నావా యని ఆమెను అడిగెను. ఆమె-అవును ప్రభువా నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడవైన

క్రీస్తువని నమ్ముచున్నానని ఆయనతో చెప్పెను" (యోహాను 11:26,27).

c. పేతురు:- యేసుక్రీస్తు శిష్యులతో "..... మీరైతే నేనెవరనని చెప్పుకొనుచున్నారని వారినడిగెను. అందుకు సీమోను పేతురు-నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను" (మత్తయి 16:15,16).

d. సౌలు:- సౌలు మారుమనస్సు బాప్తిస్మము పొందిన తరువాత శిష్యులతో కూడ కొన్ని దినములుండి... యేసే దేవుని కుమారుడని ఆయనను గూర్చి ప్రకటించుచు వచ్చెను" (అ.కా. 9:19,20).

e. కావలివారు:- "యేసు మరలా బిగ్గరగా కేకవేసి ప్రాణము విడిచెను, శతాధిపతియు, అతనితో కూడ యేసునకు కావలి యున్నవారును, భూకంపమును, జరిగిన కార్యములన్నిటిని చూచి మిక్కిలి భయపడి-నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి" (మత్త 27:50,54).

f. శతాధిపతి:- యేసును సిలువవేసినపుడు "అంతట యేసు గొప్ప కేకవేసి ప్రాణము విడిచెను...... ఆయన కెదురుగా నిలిచి యున్న శతాధిపతి ఆయన ఈలాగు ప్రాణము విడుచుట చూచి నిజముగా ఈ మనుష్యుడు దేవుని కుమారుడే యని చెప్పెను...." (మార్కు 15:37-39).

g. బాప్తిస్మమిచ్చు యోహాను:- "నేను ఆయన నెరుగనైతిని గాని నీళ్ళలో బాప్తిస్మమిచ్చుటకు నన్ను పంపినవాడు-నీవెవని మీద ఆత్మదిగి వచ్చి నిలుచుట చూతువో ఆయనే పరిశుద్ధాత్మలో బాప్తిస్మమిచ్చు వాడని నాతో చెప్పెను. ఈయనే దేవుని కుమారుడని తెలిసికొని సాక్ష్మిచ్చితిననెను" (యోహాను 1:33,34).

h. శిష్యులు:- యేసుక్రీస్తు నీళ్ళమీద నడచివచ్చినపుడు దోనెలోనున్న (శిష్యులు) వారు వచ్చి నీవు నిజముగా దేవుని కుమారుడవని చెప్పి ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 14:32,33).

అపవిత్రాత్మలు పట్టినవారు:- "అపవిత్రాత్మలు పట్టినవారు ఆయనను చూడగనే ఆయన యెదుట సాగిలపడి నీవు దేవుని కుమారుడవని చెప్పుచు కేకలు వేసిరి" (మార్కు 3:11). 

మరియు, "యేసుక్రీస్తు గదరేనీయుల దేశముచేరగా, దయ్యము పట్టిన యిద్దరు మనుష్యులు సమాధులలోనుండి బయలుదేరి ఆయన యొద్దకువచ్చి వారు-ఇదిగో దేవుని కుమారుడా నీతో మాకేమి ? కాలము రాకమునుపే మమ్ము బాధించుటకు యిక్కడకి వచ్చితివా యని కేకలు వేసిరి" (మత్తయి 8:28,29).

దయ్యములు:- యేసు సీమోను ఇంటిలోనికి వచ్చిన తరువాత రోగపీడితుల నెందరినో ఆయన యొద్దకు తీసికొని వచ్చిన వారిని స్వస్థపర్చెను. ఇంతేకాక దయ్యములు- నీవు దేవుని కుమారుడవని కేకలు వేసి అనేకులను వదలి పోయెను (లూకా 4:38-41).

గాబ్రియేలు దూత:- గ్యాబ్రియేలు సందేశమును వినిన మరియ కలవరపడి "నేను పురుషుని ఎరుగని దాననే, ఇదేలాగు జరుగునని దూతతో అనగా; దూత-పరిశుద్ధాత్మ నీ మీదికి వచ్చును, సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును." (లూకా 1:34,35). ఈ సందర్భమున యెషయా పలికిన ప్రవచనం జ్ఞాపకం చేసుకొనుట అవసరం."ఏలయనగా మనకు శిశువు పుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహించబడెను, ఆయన భుజముల మీద రాజ్యభారముండును....." (యెషయ 9:6).

పరిశుద్ధాత్ముడు:- పత్మాసులో బందీయైన యోహానుతో పరిశుద్ధాత్ముడు యిట్లు చెప్పెను. "జయించువాడు వీటిని స్వతంత్రించుకొనును; నేనాతనకి దేవుడనై యుందును, అతడు నాకు కుమారుడై యుండును" (ప్రక 21:4).

## యేసే తాను దేవుని కుమారుడనని చెప్పుకొనెను

a. యేసుక్రీస్తు యెహోవాను తన తండ్రియని చెప్పుకొనెను. విశ్రాంతి దినమున రోగిని స్వస్థపర్చినందున యూదులు యేసును హింసించిరి. అయితే యేసు నాతండ్రి యిదివరకు పనిచేసియున్నాడు. నేనును చేయుచున్నానని వారికి ప్రత్తరమిచ్చెను" (యోహాను 5:17).

b. మరియు, "తండ్రి ఏది చేయుట కుమారుడు చూచునో.... వాటినే కుమారుడు ఆలాగే చేయును" (యోహా 5:19).

c. యేసుక్రీస్తు తాను ఆరోహణమగుటకు ముందు శిష్యులతో యిట్లు చెప్పెను. "నా తండ్రి ఇంట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును. మీకు స్థలము సిద్ధపర్చ వెళ్ళుచున్నాను" (యోహాను 14:2).

d. "పరిసయ్యులు (తాను స్వస్థపర్చిన గ్రుడ్డి) వానిని వెలివేసిరని యేసువిని వానిని కనుగొని నీవు దేవుని కుమారుని యందు విశ్వాసముంచు చున్నావా యని అడిగెను. అందుకు వాడు, ప్రభువా, నేను ఆయనయందు విశ్వాస ముంచుటకు ఆయన ఎవడని అడుగగా యేసు-నీవు ఆయనను చూచు చున్నావు, నీతో మాటలాడుచున్నవాడు ఆయనే అనెను. అంతటవాడు ప్రభువా నేను విశ్వసించు చున్నానని చెప్పి ఆయనకు మ్రొక్కెను" (యోహాను 9:35-37).

e. యేసుక్రీస్తును విచారించుటకు మహాసభ యెదుటకు తీసికొని వచ్చి నపుడు "వారందరు-అట్లయితే నీవు దేవుని కుమారుడవా అని అడుగగా, ఆయన- మీరన్నట్టు నేనే ఆయనను అని వారితో చెప్పెను" (లూకా 22:70, మత్త 26:63,64; మార్కు 14:61,62).

## తండ్రి యేసుక్రీస్తు నాకుమారుడని సాక్ష్యమిచ్చుట

"యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్ళలోనుండి ఒడ్డుకు వచ్చెను; ఇదిగో-ఆకాశము తెరుడబడెను, దేవుని ఆత్మ పావురము వలె దిగి తనమీదికి వచ్చుట చూచెను. మరియు-ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు ఈయన యందు నేనానందించు చున్నానని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను" (మత్త 3:16,17).

a. యేసుప్రభువు కొండమీద రూపాంతరం పొందినపుడు "అతడు (పేతురు) యింకను మాటలాడు చుండగా ఇదిగో ప్రకాశమానమైన ఒక మేఘము వారిని కమ్ముకొనెను. ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు ఈయన యందు నేనానందించు చున్నాను, ఈయనమాట వినుడని యొక శబ్దము మేఘములో నుండి పుట్టెను" (మత్తయి 14:5, లూకా 9:35).

పై అంశమును బట్టి "యేసుక్రీస్తు దేవుని కుమారుడని" నమ్మవలెను. ఇంకను మరికొన్ని విషయములను పరిశీలించుదాము.

1. సాతాను:- "నీవు దేవుని కుమారుడ" వైతే యని పలుకుచు యేసుక్రీస్తును శోధించ మొదలిడెను (మత్తయి 4:3, లూకా 4:3,9). సాధారణముగా తెలుగు పరిభాష వాడుకలో ఆయా సందర్భములలో "నీవు మనిషివైతే" , "నీవు వీరుడవైతే", "నీవు డాక్టరువైతే" మొదలు గాగల పదములను వాడుచుందురు. మనిషిని; నీవు మనిషివైతే యని అందురుగాని, పశువును గాని, పక్షినీ గాని అనరు. వీరుడను "వీరుడైతే" యని అందురుగాని పిరికివానిని అనరు. ఆలాగే డాక్టరునే "నీవు డాక్టరువైతే" అని అందురుగాని ఇంజనీరును అనరు. అనగా యీ మాటలు రెచ్చగొట్టి, ఉద్రేక పర్చి లేదా ఆవేశపర్చి తమ కార్యములను సాధించుకొందురు. అటులనే సాతాను యేసుక్రీస్తు "దేవుని కుమారుడని" యెరిగి యుండి నీవు దేవుని కుమారుడవైతే యని ఆవేశపరచు మాటలాడి తన కార్యమును సాధించకొననెంచెను. కాని, యేసుక్రీస్తు నిజముగా దేవుని కుమారుడు గనుక సాతానుకు లొంగిపోలేదు.
2. మార్కు సువార్త:- పరిశుద్ధుడైన మార్కు తన సువార్తను, "దేవుని కుమారుడైన యేసుక్రీస్తు సువార్త" అనుమాటతో తన గ్రంధమును ప్రారంభించెను (మార్కు 1:1).
3. మన సహవాసము:- సాధారణంగా యీ లోకంలో అనేకులు, దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘమును విడిచి రకరకాల పేరులు పెట్టుకొనుచు,వివిధ రకముల సహవాసములు కలిగి వున్నారు. ఇది సత్య గ్రంధమునకు విరుద్ధము. భక్తుడైన యోహాను యిట్లు చెప్పుచున్నాడు. "మాతో కూడ మీకును సహవాసము కలుగునట్లు మేము చూచిన దానిని, వినిన దానిని మీకు తెలియజేయుచున్నాము. మన సహవాసమైతే తండ్రితో కూడను, ఆయన కుమారుడైన యేసు క్రీస్తుతో కూడను వున్నది" (1యోహాను 1:3).
4. ప్రత్యక్షత:- అపవాది మొదటినుండి పాపము చేయుచున్నాడు గనుక పాపము చేయు ప్రతివాడు అపవాధి సంబంధి. అపవాది యొక్క క్రియలను లయ

పర్చుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను" (1యోహాను 3:8).

5. ప్రదానయాజకుడు:- "ఆకాశమండలము గుండా వెళ్ళిన దేవునికుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు వున్నాడు గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదుము" (హెబ్రీ 4:14).

6. ఒప్పుకోలు:- "యేసు దేవుని కుమారుడని ఎవడు ఒప్పుకొనునో వానిలో దేవుడు నిలిచి యున్నాడు, వాడు దేవుని యందున్నాడు" (1యోహా 4:15).

7. అంగీకరించుట:- "దేవుని కుమారుని అంగీకరించువాడు జీవము గలవాడు. దేవుని కుమారుని అంగీకరింపనివాడు జీవము లేనివాడే" (1యోహా 5:12).

8. లోకమును జయించువాడు:- "యేసు దేవుని కుమారుడని నమ్మువాడు తప్ప లోకమును జయించువాడు మరెవడు ? (1యోహాను 5:5).

9. నిత్యజీవము:- "దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము గలవారని తెలిసికొనునట్లు నేను యీ సంగతులు మీకు వ్రాయుచున్నాను" (1యోహాను 5:13).

10. ఆయన నామమందు జీవము:- "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను. అవి యీ గ్రంధమందు వ్రాయబడి యుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును యివి వ్రాయబడెను" (యోహా 20:30,31).

కాబట్టి యేసు దేవుని కుమారుడు అని నమ్మి ఆయన నామమందు జీవము పొందవలెను. ఇంకను రక్షణ పొందనివారు యేసుక్రీస్తు దేవుని కుమారుడని నమ్మి మారుమనస్సు పొంది యేసు దేవుని కుమారుడని ఒప్పుకొని బాప్తిస్మము పొంది రక్షణ పొందవలసినదిగా ప్రభువు నామమున మనవి చేయుచున్నాను.

- జి. మార్కు , నందిగామ.

## నీవు క్రీస్తు వాడవా ?

### ( DO YOU BELONG TO CHRIST ? )

"నేను క్రీస్తు సంఘస్థుడను కాను, కాని క్రీస్తువాడను" అని ధీమాగా పలికేవారున్నారు. దేవుని రక్షణ సంకల్పము నెరిగిన వారెవరూ ఈమాట చెప్పజాలరు. సంఘము, క్రీస్తు వేరువేరని భావించేవారు, క్రీస్తు తన సంఘముకొరకు తన్నుతాను అప్పగించుకొనెనని విశ్వసించలేనివారు, సంఘము ప్రాముఖ్యము కాదని భావించేవారు క్రీస్తుకు విరోధులు. ఎందుకంటే క్రీస్తు మాటలకు వీరి విశ్వాసానికి ఎక్కడా సంబంధము కనిపించదు. వీరు క్రీస్తును విశ్వసించాలన్న గురి కలిగిన వారైనప్పటికిని వీరి విశ్వాసము సహేతుకమైనది కాదు. (ఎఫె 3:20-21 ఎఫెసీ5:25, 1కొరింథీ 2:4-5).

"మీ బోధ మాకవసరం లేదు" అని ఎవరైనను మాతో చెప్పిన యెడల వారు అపొస్తలుల బోధను నిరాకరించుచున్నారు. లేఖనములలో బయలు పరచబడిన బోధను అంటే అపొస్తలులు ప్రకటించిన సువార్తనే క్రీస్తు సంఘములు ప్రకటించు చున్నవి. క్రీస్తు సంఘములు బోధించు సువార్త వారి స్వంత సిద్ధాంతము కాదు. అపొస్తలుల బోధను నిరాకరించువారు క్రీస్తు వారుకాదు.

ప్రజలను ఆకర్షించి, ఆహ్లాదపరచగల యాంత్రిక సంగీతమును లేదా వాయిద్యములను ఆరాధనలో క్రీస్తు సంఘములు వ్యతిరేకించును. ఎందుకంటే జనాకర్షణ కంటే క్రీస్తు మాట వారికి ముఖ్యము. వేషధారణ క్రీస్తు సంఘాలలో కనిపించదు. వారు ఉపవాస కూటములను జరిపించరు. కారణమేమంటే లేఖనాలు వివరించే సత్యాన్ని వారు గ్రహించిన వారు.

"మీరు ఉపవాసము చేయునప్పుడు వేషధారులవలె దుఃఖముఖులై యుండకుడి. తాము ఉపవాసము చేయుచున్నట్టు మనుష్యులకు కనబడవలెనని వారు తమ ముఖములను వికారము చేసికొందురు. వారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. ఉపవాసము చేయుచున్నట్టు మనుష్యులకు కనపడవలెనని కాక, రహస్యమందున్న నీతండ్రికే కనపడవలెనని, నీవు ఉపవాసము చేయునప్పుడు నీతల అంటుకొని, నీముఖము కడుగుకొనుము. అప్పుడు

రహస్యమందు చూచుచున్న నీతండ్రి నీకు ప్రతిఫల మిచ్చును" (మత్త 6:16-17). ఈమాటలు గ్రహించిన వారెవరూ ఉపవాసమును ప్రత్యేక కూటములుగను, ప్రత్యేక దినాలుగను, బహిరంగముగను ఆచరింపరు. క్రీస్తు మాటను అనుసరింపకయే మేము "క్రీస్తువారము" అని డంబముగ పలికేవారిని గూర్చి "నేను చెప్పుమాటల ప్రకారము మీరు చేయక-ప్రభువా ప్రభువా, అని నన్ను పిలుచుట ఎందుకు?" అని క్రీస్తు ముందుగా చెప్పెను (లూకా 6:46).

యేసు ఇట్లనెను: "ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని, పరలోకమందున్న నాతండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును. ఆ దినమందు అనేకులు నన్నుచూచి మేము నీ నామమున ప్రవచింప లేదా ? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు-నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా, నాయొద్దనుండి పొండని వారితో చెప్పు దును". (మత్త 7:21-23). నేడు క్రీస్తుపేరుచెప్పి ధనార్జన కొరకు, జనాకర్షణ కొరకు చేయబూనిన అద్భుతకార్యాలు క్రీస్తు మాటల ప్రకారమైనవి కావు. అందుకే అవి విఫల మౌతున్నాయి.

క్రీస్తు సంఘములు మానవులను యిట్టి ప్రలోభాలలో పడవేయక, క్రీస్తు మాటలను ఉన్నవి ఉన్నట్లు ప్రకటించును. ఆత్మల రక్షణ మాదిరి. రక్షింపబడిన ఆత్మలు నిత్యజీవమును పొందునట్లు లేఖనాలందించే మార్గంలో క్రీస్తు సంఘములు నడచును.

ప్రియ చదువరీ, నీవు క్రీస్తువాడవు కావాలని ఆశిస్తే క్రీస్తు సంఘ సభ్యుడవు కావాలి. క్రీస్తు శరీరంలో లేకుండ క్రీస్తువాడవు ఎట్లు కాగలవు? నీవు ఏ మతశాఖలో ఉన్నను క్రీస్తు వాడవు కాలేవు. నిన్ను ఆయన తన సంఘముతో చేర్చుకొనునట్లు వాక్యమును విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, నీ విశ్వాసమును మనుష్యుల ఎదుట ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తమై బాప్తిస్మము పొందుము.

- **E. K. V.** ప్రసాదరావు, చెయ్యేరు.

# 13వ ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్ మరియు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ బైబిలు సెమినార్

## ఆహ్వానము

తేదీలు : 1997 డిశంబరు 7 నుండి 12 వరకు
ఆదివారం నుండి శుక్రవారం వరకు

స్థలము : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ - సెమినార్ హాలు
ఫోర్డ్ స్ట్రీట్, విద్యుత్‌నగర్, కాకినాడ - 533 003.

ముఖ్యాంశము : "యేసుక్రీస్తు దేవుని కుమారుడు"
**Theme** : **"Jesus Christ, the Son of God "**

గత 12 సంవత్సరములుగా ఆసియా ఖండములో వేర్వేరు దేశములలో జరుగుచున్న లెక్చర్‌షిప్ ఈ సంవత్సరము భారతదేశములో పైనుదహరించిన తేదీలలో జరుగబోవు చున్నది. ఆసియాలోని 10 లేక 14 దేశములనుండి వచ్చిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సువార్తికులు "యేసుక్రీస్తు దేవుని కుమారుడు" అనే అంశముపై గొప్ప ప్రసంగముల నందించబోవుచున్నారు. మరియు భారతదేశమునుండి ఇంచుమించు అన్ని రాష్ట్రముల వారు ఇందు పాల్గొనబోవుచున్నారు. యిది మన జీవితములో సంభవింపబోవుచున్న గొప్ప ఆనందదాయకమైన సమయం, సహవాసం. గనుక ఇందులో పాల్గొనుటకు ఇప్పటినుండి సిద్ధపడండి. ప్రార్థన చేయండి. వివరములకు ఈ దిగువ సంప్రదించండి.

నెహెమ్యా గూటం
**Convenor of the Seminar**
**P. O. Box. 57,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 64882 / 72604.**

జాషువా గూటం
**Director of the Lectureship**
**P. O. Box. 80,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 63697 / 63722.**

కృష్ణాజిల్లా సువార్తికుల సదస్సు జయప్రదము గావించుటలో సోదరులు టి. ప్రసాదరావ్ గారు ఎనలేని కృషి చేసిరి. హాజరైన వారందరికీ వందన సమర్పణ చేసిరి. స్థానిక సంఘము గొప్ప ఆతిధ్యము నిచ్చిరి. సదస్సు అనంతరము ఒకాయన బాప్తిస్మము పొందిరి. సోదరులు కె. రాజ్‌కుమార్ (విజయవాడ) గారి ప్రార్థనతో సదస్సు ముగించబడగా అందరు సంతోష హృదయంతో తమ తమ గ్రామములకు తిరిగి వెళ్లిరి. మార్చినెల కృష్ణాజిల్లా సువార్తికుల సదస్సు 21వ తేదీనాడు నంది గామలో జరుగును. దైవత్వములో ముగ్గురా ? లేక ఒక్కరా ? యను అంశము చర్చించబడును. అందరు ఆహ్వానితులే.

ఫిబ్రవరి నెల సువార్తికుల సదస్సు 25వ తేదీన సింగరాయ పాలెం (తూ॥గో॥జిల్లా) లో క్షేమాభివృద్ధి కరంగా జరిగెను. సత్యసువార్త వ్యాపింపజేయుటలో సమయము, అసమయము అను వ్యత్యాసమెరుగని సువార్తికుల సమక్షంలో "క్రీస్తు సంఘము ఏల సాటిలేనిది ?" అను అంశము చర్చించబడెను.

సింగరాయపాలెంలో క్రీస్తు సంఘము ఆరాధనకు కూడుకొనుటకు నిర్మింప బడిన ప్రార్ధనా మందిరమును సోదరులు జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి ప్రార్ధనా పూర్వకముగా ప్రవేశము గావించిరి.

సమావేశమునకు సోదరులు జాషువా గూటం గారు అధ్యక్షత వహించి చర్చ ను సమర్ధవంతముగ నడిపించిరి. సోదరులు S. వీరంశెట్టి, P. హెన్రీ, N. J. మోహన్ రావు, D. రంగారావు, B. యోహాను, P. D. బిషప్, పాల్‌గూటం, ఎలిపే ప్రభాకర రావు, G. షడ్రక్, P. S. R. జయపాల్ మరియు జాషువా గూటం గార్లు పై అంశముపై చక్కని వర్తమానమును అందించిరి.

క్రీస్తుసంఘము వాక్యానుసారమైన దాని నామము, పరిపాలన, ఆరాధనా క్రమము, రక్షణ సంకల్పమును బట్టియు, దానికొరకు తన్నుతాను అప్పగించుకొని, తన స్వరక్తమిచ్చి దానిని సంపాదించిన క్రీస్తును బట్టియు సాటిలేనిది (ఎఫె.5:25 అ.కా. 20:28). "ఈబండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దాని ఎదుట నిలువనేరవు" (మత్త 16:18) అని క్రీస్తుప్రభువు చెప్పిన ఈ మాట ధ్యానిస్తే క్రీస్తు సంఘమునకు సాటియైనది మరేదిలేదని తెలిసికొనగలము. ఏ మానవుడు దానిని స్థాపించలేదు. దాని రక్షకుడు క్రీస్తు. క్రొత్త నిబంధన దాని చట్టము. అది క్రీస్తు మాటలను, మాదిరిని, ప్రేమను అనుసరిస్తుంది.

మానవకల్పిత మతశాఖలు దీనితో సరితూగలేవు. క్రీస్తు సంఘమును నిరాకరించువాడు తండ్రియైన దేవుని, ఆయన కుమారుడైన క్రీస్తును నిరాకరించు చున్నాడు. పెంతెకొస్తను పండుగ దినమున యెరూషలేములో క్రీ.శ 33లో స్థాపింప బడిన మహిమాన్వితమైన సంఘమది. దానియేలు, యెషయా, యిర్మియా వంటి

ప్రవక్తలు దీని ఔన్నత్యమును గూర్చి ప్రవచించిరి. ఒక మతశాఖ క్రీస్తుసంఘముతో సరితూగ లేదు.

దేవునికి మహిమ క్రీస్తుయేసు ద్వారా సంఘములో కలుగుతుంది. లోకాన్ని హెచ్చరించునది, క్రమపర్చునది, లోకాన్ని రక్షించే పని కలిగియున్నది క్రీస్తు సంఘమే. అందుకే అది సాటిలేనిది. క్రీస్తుసంఘము తప్ప సత్యమును బోధించు సంఘము మరేది లేదు. యిది జగత్తు పునాది వేయబడక మునుపే దేవుని మనస్సులో ఆయన సంకల్పములో నున్న సంఘము. క్రీస్తుసంఘము ఒక ప్రాంతానికి పరిమితమైనది కాదు. సార్వజనికమైనది. ఆపద కలిగినచోట, ఆకలిగలచోట, వాక్యము అవసరమైన చోట క్రీస్తుసంఘము తన స్పందనను తెలియజేయును. గనుక అది సాటిలేనిది.

సోదరులు E. K. V. ప్రసాదరావ్ గారి వందన సమర్పణతో సదస్సు ముగిసిన పిదప ఏడుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరులు E. K. V. ప్రసాదరావ్ గారు చెయ్యేరు, అనాతవరం, సింగరాయ పాలెం, మాగాం గ్రామములలో గొప్ప పని చేయుచు క్రీస్తుకొరకు మంచి ఫలితములు సాధించుచున్నారు. సింగరాయ పాలెం సంఘము, ప్రసాదరావ్ దంపతులు సదస్సుకు హాజరైన సోదరులకు మంచి ఆతిధ్యమిచ్చిరి. మార్చినెల సువార్తకుల సదస్సు పశ్చిమ గోదావరి జిల్లా జొన్నల గరువులో జరుగును.

---

**Regd. No. H / KD-45 / K.D. H.O**

**Date of Posting : 15 th of Every month**

**From:**

**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA - 533 001

**To**